క్లుప్తంగా

అరుణాచలేశ్వర స్వామికి పూజలు


కృత్తిక నక్షత్ర పూజ చేస్తున్న భక్తులు

పెనుగొండ : సిద్ధాంతం దుర్గమ్మ ఆలయం వద్ద కృత్తికా నక్షత్ర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృత్తికా నక్షత్రం సందర్భంగా శుక్రవారం తమిళనాడులో అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో అఖండ జ్యోతి ప్రజ్వలన చేసే సమయానికి స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద అరుణాచలేశ్వర స్వామి, అపిత కుచులాంబ అమ్మవార్ల చిత్రపటాలను ఉంచి అఖండ జ్యోతి ప్రజ్వలన అర్చకుడు పురాణం రమణ బ్రహ్మత్వంతో ఆచంట శ్రీరామచంద్రమూర్తి వీర రాఘవమ్మల దంపతులచే చేశారు.

వాకర్స్ క్లబ్ వితరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి శేషప్రసాద్‌కు గుండె వ్యాధి సంబంధిత రూ.14 వేల విలువ చేసే మందులను అందజేశామని క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు తెలిపారు. సఖినేటిపల్లిలోని ఓ ఆలయంలో అర్చకునిగా శేషప్రసాద్ పనిచేస్తున్నారని, ఆయన ఇంటికెళ్లి మందులు అందజేశామని చెప్పారు. క్లబ్ సెక్రటరీ షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవ రాజు, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, బోణం రాజు, సరెళ్ల జయప్రసాద్ పాల్గొన్నారు.

శాంతికి చిహ్నం క్రిస్మస్


మహిళా కళాశాలలో క్రిస్మస్ వేడుక

నరసాపురం: స్థానిక బీజీబీఎస్ మహిళా కళాశాలలో శుక్రవారం గ్రాండ్ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలతో అలరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రిస్మస్ శాంతికి సూచకమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి మన పండుగలు చిహ్నమని చెప్పారు. పాస్టర్ రత్నరాజు క్రిస్మస్ సందేశం వినిపించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. ప్రిన్సిపాల్ మధుశాలిని, కె.రజనీకుమారి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.అమ్మాజీ పాల్గొన్నారు.

సేవ్ ద గర్ల్ చైల్డ్‌లో మనమ్మాయికి చోటేది?

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో ఈ నెల 15న మంత్రి నిమ్మల రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ్ ది గర్ల్ చైల్డ్ 2 కె రన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణులు, సేవా మూర్తులు సైనా నెహ్వాల్, పీవీ సింధూ, పీటీ ఉష, సుధా నారాయణమూర్తి, కల్పనా చావ్లా, నైనా జైస్వాల్, మదర్ థెరిస్సా, ఇందిరా గాంధీ, లతా మంగేష్కర్, ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజిని నాయుడు, సావిత్రిబాయిపూలేల చిత్రాలను ఏర్పాటు చేసి ఆడపిల్ల తల్లికి సాయం, తండ్రికి స్నేహం, అన్నదమ్ములకు ఆసరా అంటూ కొన్ని క్యాప్షన్‌లతో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఐతే పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థిని దంగేటి జాహ్నవి అమెరికాలోని నాసాకు ఎంపికైంది. నాసా ప్రపంచంలోనే 60 మందిని ఎంపిక చేయగా అందులో భారతదేశం నుంచి పాలకొల్లు పట్టణానికి చెందిన జాహ్నవి ఒక్కరే కావడం గర్వకారణం. జాహ్నవి నాసా ఐఏఎస్‌పీ ఇండియా నుంచి ఎంపికతో పాటు ఇటీవల యంగెస్ట్ ఫారెన్ అనలాగ్ ఆస్ట్రోనాట్, సైంటిస్ట్ ఆస్ట్రోనాట్ క్యాండిడేట్, యంగెస్ట్ అడ్వాన్స్ స్క్యూబా డైవర్‌గా నాలుగు విభాగాలకు ఎంపికైంది. సేవ్‌ది గర్ల్ చైల్డ్ 2 కె రన్ కార్యక్రమంలో ఎక్కడా జాహ్నవి ఫొటో కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

శ్రీనివాసరెడ్డికి సేవా పురస్కారం

పెనుమంట్ర: నెగ్గిపూడి గ్రామంలో 20 ఏళ్లుగా మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ పేరుతో పేదలకు సేవలు అందిస్తున్న నెగ్గిపూడి గ్రామానికి చెందిన కర్రి మురళీ శ్రీనివాస్‌రెడ్డికి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్‌ను యుద్ధనౌక గద్దర్ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మనం ఫౌండేషన్ చైర్మన్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో వెన్నెల గద్దర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతులు మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఫౌండర్ సాకా రాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

హోమియో వైద్య సేవలు

పెనుగొండ: పాలకొల్లులోని శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి ఆసుపత్రి ఆధ్వర్యంలో టెలికాలింగ్ ద్వారా ప్రతిరోజూ అందిస్తున్న ఉచిత హోమియో వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వైద్యులు కోసూరి రామకృష్ణానందరాజు (పోడూరు రాజు) పిలుపునిచ్చారు. పోడూరు మండలం వేడంగిపాలెంలో శుక్రవారం టెలికాలింగ్ ద్వారా హోమియో వైద్యసేవలందించారు. శిబిరంలో 19మంది రోగులకు డాక్టర్ రామకృష్ణానందరాజు వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మందులను ఉచితంగా అందజేశారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి
- భీమవరం ర్యాలీగా తరలిన నాయకులు


పాలకొల్లులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గుడాల గోపి


పోడూరు మండలం నుంచి ధర్నాకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలకొల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి గోపి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సుమారు 200 మంది చిన్నకార్లు, మోటార్‌సైకిళ్లపై భారీ ర్యాలీగా భీమవరం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గోపీ పార్టీ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు అన్నదాతకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. సార్వా పంటను దళారులు దోచుకుంటున్నారని, ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర చెల్లించడం లేదని విమర్శించారు. రైతుకు పంట నష్టపరిహారం ఇవ్వలేదని, ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. సంక్షేమ పథకాలను విస్మరించారని, కేవలం రెడ్‌బుక్ పాలనతో అరాచకాలు సృష్టిస్తున్నారని, పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసి దుర్మార్గ రాజకీయాలకు తెరలేపారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై పోలీస్ కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపోయారు. తొలుత గాంధీ బొమ్మల సెంటర్‌లో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చిలువూరి కుమారదత్తాత్రేయ వర్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, గుంటూరు పెద్దిరాజు, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, ఉచ్చుల స్టాలిన్, ఇనుకొండ రవి, పెదపాటి పెద్దిరాజు, కుక్కల బాలచంద్రన్, మంద హరికిరణ్, దేవ రాజేష్, మద్దా చంద్రకళ, పైలా రాజేశ్వరి, కోరాడ శ్రీనివాసరావు, జోగాడ ఉమామహేశ్వరావు, చెన్ను విజయ్, పాలపర్తి కృపానాథ్, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి గంగపవన్, వల్లభు నరసింహారావు, బొడ్డేటి సూర్యనారాయణ, ఉంద్రాజవరపు రవి, నక్కా చిత్తరంజన్, దొమ్మేటి శ్రీను, కొత్రపాటి వీరాస్వామి, వడ్లపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరు మండలం నుంచి..

పోడూరు మండలంలో పాలకొల్లు నియోజకవర్గం పరిధి 8 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు భీమవరం తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ఆధ్వర్యంలో వీరంతా ధర్నాకు తరలివెళ్లారు. వీరిలో జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, జిల్లా యూత్ కార్యదర్శి దేవ రాజేష్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తొండా శ్రీనివాస్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొత్రపాటి వీరాస్వామి, నాగరాజు బాలాజీవర్మ, వడ్లపాటి సురేష్, వడ్డి సంజయ్, చలం, జయరాజు తదితరులు ఉన్నారు.

నరసాపురం నుంచి భారీ ర్యాలీగా..

నరసాపురం: రైతులకు అండగా భీమవరం కలెక్టరేట్‌లో వైఎస్సార్ సీపీ శుక్రవారం నిర్వహించిన ఆందోళనకు నరసాపురం నుంచి పార్టీ శ్రేణులు కదిలి వెళ్లాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతాంగ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. సాగుకు పెట్టుబడి రైతులకు చేతిలో రూపాయి లేకుండా చేశారని వాపోయారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ప్రజలు తరపున పోరాటం చేస్తామన్నారు. నరసాపురం, మొగల్తూరు నుంచి కార్లు, మోటార్ సైకిళ్లపై ర్యాలీగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు తరలివెళ్లారు. భీమవరం వెళ్లిన వారిలో పార్టీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, సీనియర్ నాయకులు కామన బుజ్జి, కావలి నాని, బర్రి శంకరం, కడలి పెద్దిరాజు, చదలవాడ మెర్లిన్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

నరసాపురం రూరల్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల సీఐ దుర్గాప్రసాద్ సూచించారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం మత్స్య కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు కూడా కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ టి.నీరజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్ వీరభద్రరావు, కె.శ్రావణి, ఎస్సై టీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సంఘాలకు ఎన్నిక

పెనుగొండ: పోడూరు మండల పోడూరు, పెనుమదం, మట్టపర్రు, కవిటం, వేడంగి గ్రామాల నీటి సంఘాలకు ఆయా గ్రామాల్లోని హైస్కూళ్ల వద్ద ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల (టీసీ) ఎన్నిక నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ తెలిపారు. రైతులు శనివారం ఉదయం 9 గంటల్లోపు ఎన్నికల కేంద్రానికి చేరుకుని ఓటరు లిస్టులో తమపేరు సరిచూసుకోవాలని, నామినేషన్ పత్రాలతో పాటు భూమి నీటి పన్ను రశీదును ఎన్నికల అధికారికి అందజేయాలని పేర్కొన్నారు. ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు టీసీ ఎన్నిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

పెనుగొండ: స్థానిక శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోని గోశాలకు చిన్నంవారిపాలెంకు చెందిన చిన్నం సత్యనారాయణ రెడ్డి (చిన్ని) పశుగ్రాసం వితరణ చేశారు. శుక్రవారం ఐదెకరాలకు చెందిన గడ్డిని కట్టలుగా కట్టి సొంత ఖర్చులతో ఆలయానికి చేర్చారు. దాతలకు ఆలయాధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్ణీత గడువులోపే భూ సమస్యలకు పరిష్కారం


యాళ్లవానిగరువులో దరఖాస్తులు స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



దొడ్డిపట్ల సదస్సులో పాల్గొన్న ఆర్డీఓ దాసి రాజు

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాలకొల్లు అర్బన్: రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్లవానిగరువు వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 320 గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 13 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జేసీ చెప్పారు. సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి 33 రోజుల్లో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సదస్సులో 19 మంది రైతులు అర్జీలు అందజేశారని తెలిపారు. అనంతరం పాలకొల్లు రూరల్ పంచాయతీలో పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చిన లే అవుట్ స్థలాలను పరిశీలించారు. ఈ స్థలాల్లోకి వెళ్లేందుకు నడక మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. సదస్సులో తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, సర్వేయర్ శైలజ, గ్రామ పెద్దలు దొడ్డా శ్రీనివాసరావు, పాముల రజనీకుమార్, పంచాయతీ కార్యదర్శి సత్తిబాబు, వీఆర్వోలు సీహెచ్ బుజ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

మొగల్తూరు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. మండలంలోని కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కొత్తపాలెంలో 20, శేరేపాలెంలో 26 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ తెలిపారు. గొంతేరు డ్రెయిన్ తవ్వకంలో కోల్పోయిన భూములకు నేటికీ పరిహారం అందలేదని, పేర్ల మార్పు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు సరిచేయాలని, పాస్ పుస్తకాలు కోసం రైతుల నుంచి అందాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: నరసాపురం మండలం కొత్త నవరసపురం, పాతనవరసపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటి పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ టి.రాజేశ్వరి తెలిపారు. ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పోడూరు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. శుక్రవారం పోడూరు మండలం పెనుమదం గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి 24 ఫిర్యాదు వచ్చాయన్నారు. గ్రామ సర్పంచ్ తానేటి బాబూరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు చక్కని వేదికన్నారు. ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్‌ఓలు రాజశేఖర్, ఇందిర, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం చినమల్లం, దొంగరావిపాలెంలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ జి.అనితకుమారి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు కోన రామలింగేశ్వరరావు, కె.సుబ్రహ్మణ్యం, డీటీ రాజేష్ పాల్గొన్నారు. ఆచంట మండలం పెద్దమల్లం సదస్సులో తహసీల్దారు జి.కనకరాజు దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ డి.విజయలక్ష్మి, సబ్ రిజిస్ట్రారు కె.వెంకటపతిరాజు, టీడీ పద్మావతి, ఆర్ఐ లక్ష్మి, వీఆర్‌ఓ శేషగిరిలు పాల్గొన్నారు.

లంక భూములకు సీ క్లాస్ పట్టాలివ్వండి

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామంలో సాగులో ఉన్న పెరుగులంక భూములకు సీ క్లాస్ పట్టాలు మంజూరు చేయాలని రైతులు కోరారు. కంచుస్తంభంపాలెం, దొడ్డిపట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దొడ్డిపట్ల సదస్సులో జూలై నెలలో వచ్చిన వరదలకు తమలపాకు తోటలు పూర్తి మునిగిపోయి నష్టం వాటిల్లిందని, నేటికీ పరిహారం మంజూరు కాలేదని రైతులు ఆర్డీఓ దాసి రాజుకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ హామీనిచ్చారు. కంచుస్తంభంపాలెంలో పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం 14, డిజిటల్ సంతకాలు కోసం 2 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెండింటిపై డిజిటల్ సంతకం చేసి వెంటనే పరిష్కరించారు. దొడ్డిపట్లలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 17 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్, ఆర్ఐ యశోద, సర్పంచ్ ఆకుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

నరసాపురం: విద్యుత్ సమస్యలకు 60 రోజుల్లో పరిష్కారం చూపకపోతే న్యాస్థానాన్ని ఆశ్రయించవచ్చని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ వినియోగదారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయంలో ఆయన విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఆన్‌లైన్ లేదా పోస్టల్ లేదా నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సత్యనారాయణ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో 8,204 కేసులు పరిష్కరించామని చెప్పారు. ఎలక్ట్రికల్ ఈఈ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాలతో గ్రామాభివృద్ధి


పాలకొల్లు అర్బన్: సుస్థిర లక్ష్యాలతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ ఎస్ఎన్ ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ తరగతుల్లో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 9 అంశాలు, 17 లక్ష్యాలతో కార్యక్రమంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈవోపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు, ఎంఈఓలు పి.వీరాస్వామి, ఆర్ఎస్‌వీఎస్ గంగాధర శర్మ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఏపీఎం ఆచార్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీఎన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

మొగల్తూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి అన్నారు. సుస్థిర అభివృద్ధిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం రెండో శిక్షణ తరగతుల్లో అయన మాట్లాడారు. ప్రజల కనీస అవసరాలు తర్చే విధంగా పనిచేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిరసన

పెనుగొండ: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ గోవిందరెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆచంట ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం సచివాలయ సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించిన నిరసన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఏ పనిలేదని, ఖాళీగా ఉంటున్నారనడంపై వారు మండి పడ్డారు. తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



విలేకర్లపై దాడి అమానుషం


తహసీల్దార్ దుర్గా కిషోర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కడప జిల్లాలో కడప సాక్షి విలేకరిపై జరిగిన దాడిని ఖండిస్తూ పాలకొల్లు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ ఆధ్వర్యంలో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విలేకర్లపై దాడి అమానుషమని అన్నారు. వార్తలు రాస్తే దాడులు చేస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. కడపలో రిపోర్టర్‌పై జరిగిన దాడికి కారణమైన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సెక్రటరీ ఎంఎస్‌వీ సాంబశివరావు, ట్రెజరర్ తోట రాంబాబు, మద్దా విజయ లాజరస్, బుడ్డిగ గోపి, అడ్డాల నరేష్, కొంతేటి శాంతారావు, సరగం సత్యనారాయణ, బాలాజీ, ఏడుకొండలు, గోపాల్, రామకృష్ణ, మండెల అప్పలరాజు, కాపిశెట్టి గోపాలరావు, గోపరాజు గోపి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న అంజలి పాఠశాల విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో పట్టణానికి చెందిన అంజలి మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల సెక్రటరీ వీడీవీ ప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో 10వ తేదీన నిర్వహించిన ఆటల పోటీల్లో జూనియర్స్ బాయ్స్ రన్నింగ్‌లో కట్టా సాయికుమార్, సీనియర్స్ విభాగంలో ఎన్ వినయ్ బాబు ప్రథమ స్థానాలు, జి.పోతురాజు ద్వితీయ స్థానం సాధించాడని పేర్కొన్నారు. బాలికలు జూనియర్స్ విభాగంలో వై గోవర్ధిని, వై సత్యశ్రీ, వి.కావ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించారని తెలిపారు. సీనియర్స్ బాలికల విభాగంలో పి.కళ్యాణి తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ నాగరాణి అభినందనలు తెలిపారని వివరించారు.

ఐఎల్‌టీసీతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

నరసాపురం రూరల్: అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్ టీసీ) ఏర్పాటుతో లేసు అల్లిక మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించారని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఇండియా - దక్షిణాది రాష్ట్రాల సంచాలకులు కలవకొలను నాగ తులసి అన్నారు. నరసాపురం మండలం రుస్తుం బాద గ్రామంలోని ఐఎల్‌టీసీ సెంటర్లో గత 25 రోజులుగా నిర్వహించిన క్రోచెట్ లేస్ బొమ్మలపై శిక్షణ ముగింపు వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది లేసు అల్లికల మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కేంద్రాలి మంత్రిత్వ శాఖ విజయవాడకు చెందిన హ్యాండీక్రాఫ్ట్ ప్రమోషన్ ఆఫీసర్ రవీంద్ర గౌతం, డిజైనర్ సుగుణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 58 మందికి ఉద్యోగాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురు, శుక్రవారాల్లో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు తెలిపారు. 180 మంది అభ్యర్థులు పాల్గొన్నగా, వీరిలో 28 మంది చాంబర్స్ కళాశాల, 30 మంది ఇతర కళాశాలల అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, ఎఫ్ఎస్ఐటీ సొల్యూషన్స్ కంపెనీ హెచ్ఆర్‌లు పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.2.2 లక్షల నుంచి రూ.5.5 లక్షల వరకు వేతనాలు అందుతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు

యలమంచిలి: స్థానిక జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపు టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు ప్రతి ఏడాది తాళ్లూరి వెంకట నారాయణ ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్‌లు పేరిట ఆయన కుమార్తె డాక్టర్ తాళ్లూరి సీతాదేవి (ఎన్ఆర్ఐ) రూ.25 వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నారు. ఈ ఏడాది స్కాలర్‌షిప్ పరిధిని మరింత విస్తరించి స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు ఇంటర్ తరువాత కూడా డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసన్ ఇలా ఏం చదువుకున్న మళ్లీ 60 శాతం మార్కులు సాధిస్తే మరో రూ.25 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించారు. 2022-23 సంవత్సరం ఇంజినీరింగ్ సీఎస్ఈలో 65 శాతం మార్కులు సాధించిన బర్రే ప్రమీలకు, బీ ఫార్మశీలో 72 శాతం మార్కులు సాధించిన తిరుమాని బిందుమాలినికి, 2023-24లో ఇంజినీరింగ్ ఈసీఈలో 79 శాతం మార్కులు సాధించిన శనగళ్ల రజనీకి శుక్రవారం రూ.25 వేలు చప్పున చెక్కులను కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు యలమంచిలి సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.నాగజ్యోతి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చింతా చిట్టిబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.